

# హృదయమున్న మనుషులు

యం.ఐ.కిషన్

"ఆఖరికి నువ్వు కూడా ..." కౌసల్య కంఠం దుఃఖంతో పూడుకు పోగా అనదల్చుకున్నది పూర్తిగా అనలేకపోయింది.

"అవును. నేను కూడా ఆ మాటే అంటాను. ఒకసారి కాదు ... నూరుసార్లు అంటాను. నువ్వెన్ని కుంటి సాకులు చెప్పినా, నీ కాపురం ఇలా తగలబడ్డానికి నీ చేతగానితనమే కారణం. ముందుముందింకేం జరిగినా పూర్తి బాధ్యత నీదే" నిర్ద్వంద్వంగా, నిర్మొహమాటంగా అన్నాడు సత్యసాయి.

మోకాటిచిప్పల్లోంచి చివ్వున తల పైకెత్తి ఉక్రోషంగా చూసింది కౌసల్య. "హు ... నువ్వు మగాడివే. అందుకే ... అందుకే ..."

"అందుకే నే నతన్ని సమర్థిస్తున్నాను — అంతే తప్ప నీ తప్పేం లే దంటావ్ ...?"

అన్నయ్య కళ్ళలోని తీక్ష్ణతకు వెరచి కళ్ళు దించుకున్నా, స్థిరంగానే అంది కౌసల్య: "అవును. మగ మనస్సుతో కాకుండా నా స్థానంలో నిన్నూహించుకొని ఆలోచించు."

"ఏమి టాలోచించాలి? ఆలోచించేందు కేమీ లేదు. నీ అజ్ఞానానికి విచారించా లంతే." లేచి నించున్నాడు సత్యసాయి.

"అజ్ఞానమే అనుకో, అహంకారమే అనుకో. నువ్వే మనుకున్నా సరే నేను మాత్రం ఇంక అతనితో కాపురం చెయ్యను. చేయలేను. భార్యంటే మనసులేని ఒక బండరాయిగా భావించే ఆ మనిషితో కాపురం చేయడమంటే ఆత్మాభిమానాన్ని చంపుకోవడమే అవుతుంది."

"టూ బుక్కిష్" సాయి కంఠంలో ధ్వనించీ ధ్వనించని వెటకారం.

ఎప్పుడో ఆరేళ్ళ క్రితం ఆరో తరగతి పాసైన కౌసల్యకి ఆ మాట అర్థం కాకపోవడం సహజమే! "అంటే?" అన్నట్టు చూసింది.

"ఆత్మాభిమానం, అది వాదడం — కేవలం పుస్తకాల భాష! మొగుడూ పెళ్ళాల మధ్య ఆత్మాభిమానాలూ, ఆత్మ గౌరవాలూ కాదు ఉండాల్సింది. సర్దుకుపోయి బతకడం తెలియాలి. తెలీకపోతే నేర్చుకోవాలి" విసవిసా బయల్దేరి వెళ్ళిపోయాడు సత్యసాయి.

అతను వెళ్ళిన వేపు నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తూ అనుకొంది కౌసల్య! 'అన్నయినా, తమ్ముడైనా, తండ్రైనా ... ఎవరైనా సరే ... మగాడు మగాడే, మగబుద్ధి మగబుద్దే."

అలా అనుకొంటుంటే — ఆమె కళ్ళలో నిండు కొన్న కన్నీళ్ళు బుగ్గలమీదికి జారాయి.

కొంగొటితో వాటిని తుడుచుకుంటూ ఆలోచనలో పడింది.

పడిందనేకన్నా అవే ఆమె నల్లుకున్నా యనడం సబబు.

అమ్మా నాన్నలమా బెలా ఉన్నా, సాయన్నయ్యకి మాత్రం చిన్నప్పట్నించీ తనంటే పంచ ప్రాణాలు.

ఎన్నో సందర్భాలలో వాడు తన పట్ల కనబరిచే ప్రేమ తన నెంతగానో ఆశ్చర్యపరిచేది.

పెళ్ళయి తను కాపురానికి వెళ్ళాక, పెళ్ళాంతో చేయించుకుంటున్నాడో లేక తనే చేసుకుంటున్నాడో తెలీదు గాని, అంతకుముందు మాత్రం వాడికి సంబంధించిన ప్రతి పనీ తనే చేసేది. కాదు ... తన చేతనే చేయించుకొనే వాడు.

వాడింట్లో ఉన్నాడూ అంటే — వాడి నోటి వెంబడి కనీసం పది నిముషాల కొకసారైనా 'కౌసల్యా!' అన్న పిలుపు వచ్చి తీరాల్సిందే!

"కౌసల్యా! నా పెన్నేదమ్మా?" 'కౌసల్యా, నా ఏవీ మ్యాలికావా?', 'కౌసల్యా! నా కేమైనా ఉత్తరాలొచ్చాయా?" — ఇలా ప్రతిది తనే అడిగేవాడు. ప్రతి పనీ తన చేతనే చేయించుకునే వాడు.

చేసేది తను.

విసుక్కుంటూనో, సణుక్కుంటూనో కాదు. సంతోషంగా చేసేది. వాడి కే పనిచేసి పెట్టాలన్నా తన కెంతో ఇష్టంగా ఉండేది. ఎందుకంటే ప్రతిఫలంగా వాడు తన పట్ల అపురూపమైన ప్రేమను కనబరిచేవాడు.

ఉద్యోగంలో చేరాక వాడు కొనిచ్చిన చీరల మాట సరే, ఉద్యోగం సద్యోగం లేనప్పుడు కూడా వాడి ఖర్చులకని నాన్నగా రిచ్చే డబ్బుల్లోనే కొంత పొదుపు చేసి తన కేదో ఒకటి కొనిస్తుండేవాడు. మొన్ననే కదా గాజు లేయించుకున్నావు. ఇప్పుడు మళ్ళీ ఈ గాజు లెందుకు ఇలా నీ డబ్బంతా నా కోసం ఖర్చు చేయకపోతే నీ మనసు కుదురుగా ఉండదా? నీ బనీన్లన్నింటికీ కిటికీ లెక్కువై పోతున్నాయ్. ఈ అగ్రహారపాయలా గాజులకి తగలెయ్యకపోతే,ఒక బనీను కనుక్కోలేక పోయావా?" ఈ ధోరణిలో మాట్లాడేది కౌసల్య.

వాడు నవ్వేసి ఊరుకునేవాడు. ఆ నవ్వులోని తృప్తిని గమనించి తన మనసు పొంగిపోయేది.

తన కేమైనా రోగ మొస్తే చాలు, వాడికే వచ్చినట్టు విలవిల్లాడి పోయేవాడు. కాదు ... తన కాల్లో ముల్లు గుచ్చుకుంటే వాడి గుండెలో గునపం గుచ్చినంతగా బాధపడి పోయేవాడు.

అలాంటి వాడు ... అంత అపురూపంగా తనని చూసుకున్న వాడు ... ఈ నాడు వదినతో కూడి తనూ ఆ మాటే అంటున్నాడు!

ఆ కుసంస్కారితో — మూర్ఖునితో— ఎంతగా ప్రాణం విసిగిపోక పోతే తానీ నిర్ణయానికి వచ్చి ఉంటుందో కొన్నాళ్ళునా ఆలోచించకుండా, తన పరిస్థితిని అవగాహన చేసుకోవడానికి బొత్తిగా ప్రయత్నించకుండా వదినతో ఏకమై తననే నిందిస్తున్నాడు! నిందించడమే కాదు, తిట్టిపోశాడు కూడాను!!

కౌసల్య కళ్ళు మళ్ళీ నిండు కున్నాయ్.

తన కాపురంలోని అపసవ్యత కన్నా అన్నయ్య తన పట్ల కనబరచిన తిరస్కార భావమే ఆమెను మరింతగా బాధిస్తూంది.

"నీ కంత భార మనుకుంటే చెప్పు ... నా దారిన నేను ఎక్కడికైనా పోతాను ... బ్రతగ్గలిగితే బ్రతుకుతాను; లేదంటే ఏ నుయ్యో గొయ్యో చూసుకుంటాను. అంతేగాని, వ న్నతని దగ్గరికి వెళ్ళమని మాత్రం బలవంతం చేయకు" అని తానంటే—"నీకు నాలుగు మెతుకులు పడేయడం భార మనుకునేంత నికృష్టమైన స్థితిలో లేను నేను. నీ బాగుకోసమే చెప్తున్నా — వెళ్ళిపో అని" అంటూ ముఖం ప్రక్కకి తిప్పేసుకున్నాడు.

తనంత మాట అన్నందుకు కన్నీళ్ళు నింపుకుంటాడనుకుంది తను.

కానీ... కన్నీళ్ళు కాదు సరికదా, కించిత్తు బాధైనా కనబళ్ళేదు వాడిలో. అదేగనక ఇదివరకైతే—తననంత మాటంటే సహించ గలిగే వాడేనా?

ఎంత మారిపోయాడు!

పెళ్ళయ్యాక ఆడపిల్ల పూర్తిగా పరాయిదై పోతుందంటారు ఇందుకే కాబోలు.

'అతను న న్నో మనిషిగా గుర్తించడం లేదు. అత నాడమన్నట్టల్లా ఆడేందుకే గాని, నా కంటూ ఒక మనసుంటుందని ... వ్యక్తిత్వం ఉంటుందని ... అతను వూహామాత్రంగా నైనా అనుకోవడంలేదు' అని మొదలెట్టి అతని అనుచిత ప్రవర్తనను తను విపులంగా చెబుతుంటే— నిర్లిప్తంగా తల పంకిస్తూ సావధానంగా అంతా విని, "అయితేమాత్రం? ఎలాగో ఒకలా సర్దుకు పోవాలిగాని... కాపురమే వద్దంటూ ఇలా వచ్చేయడమేనా?" అంటూ హితబోధ మొదలెట్టాడు.

కనీసం తన తృప్తికోసమైనా 'అయ్యో, అలాగా?' అనిగాని, 'ఎరక్కపోయి నిన్నతనికి కట్టబెట్టాం, నీకెన్ని కష్టాలొచ్చాయమ్మా!' అని గానీ ఒక్క ముక్కయినా అనలేదు.


అనకపోతే పోయె ఆ సమయంలో ఆ ముఖం నిండా ఎంత విసుగుదల! ఎంత కోపం!

ఛ, ఛ... ఎరక్కపోయి వచ్చింది తను— అని అనిపించింది తనకి.

కానీ ... ఏం చేయడం?

"భార్యంటే వంట చేసి పెట్టడానికీ, మీ క్కావలసినసుఖం అందించడానికీ మాత్రమే. పనికొచ్చే మరబొమ్మ కాదు. ఈ విషయం మీరు గుర్తించే వరకూ తిరిగి నే నీ ఇంటి గడప తొక్క" నని కుండ బ్రద్దలు కొట్టినట్టు తెగేసి చెప్పి వచ్చేసింది తను.

ఏనాటికైనా అతను తన తప్పు గ్రహించి, "కౌసల్యా! నా కళ్ళు తెరుచుకున్నాయి. రా, మనింటికి వెళ్ళిపోదాం" అంటూ వస్తే తప్ప — ఏ ముఖం




పెట్టుకుని తనంతట తానుగా అతని దగ్గరికి వెళుతుంది తను? అదీ ఇంత త్వరలో!

అవును. తనొచ్చి నాల్రోజులైనా కాలేదు.

కానీ ... అప్పుడే నరకాన్ని తలపింప జేస్తూంది ఇంటి వాతావరణం!

వాతావరణం అంటే మనుషులే.

అన్న—వదిన.

ఇద్దరి కిద్దరే ఎంతగా మారిపోయారు?!

అన్నయ్యంత కాకపోయినా, వదిన కూడా తన పట్ల ఇష్టంగానే ఉండేది. 'ఆడపడుచు—అర్ధ మొగుడు అంటూ తనతో ఏ పనీ చేయ నిచ్చేది కాదు. తనంతట తాను చేయ బోయినా "నీ కెందుకులేమ్మా ఈ శ్రమ! రే పొద్దున్న అత్తవారింటి కెళ్ళాక అక్కడెలాగూ తప్పదు గదా" అంటూ తనని వారించేది.

అమ్మా నాన్నలు తన పెళ్ళికి ముందే పోయారు.

వాళ్ళు పోయిన ఏడాదికి అన్నయ్యే ఈ సంబంధం చూసి చేశాడు.

తనని కాపురానికి పంపేటప్పుడు—సొంత తల్లి కూతుర్ని కాపురానికి పంపినట్టే వదిన కన్నీళ్ళతోనే సాగనంపింది తనని. వయసుకి చిన్నదే అయినా, పెద్ద ఆరిందాలా అత్తవారింట ఎలా మసలుకోవాలో ఒకటికి పదిసార్లు చెప్పి పంపింది.

అనా డేమనుకుంది తను?

"నిండా ఏడాది సాంగత్యమైనా లేదు తనకూ, వదినకీ. ఈ స్వల్ప వ్యవధిలోనే తన మీద ఇంత ప్రేమను పెంచుకుందంటే వదిన మామూలు మనిషి కాదు—అనురాగమయి, దేవత అనుకొంది.

కానీ. . .ఇప్పుడో?... దేవత ననుకున్న ఆ వదినే తనని చూసి ముఖం ముటముటలాడిస్తూంది!

కొద్దో గొప్పో మామూలుగా ప్రవర్తించిందీ అంటే—ఏదో ఆ వచ్చిన రోజునే.

ఆ మర్నాటి నుంచి ప్రతి చిన్న విషయానికీ జగడమే!

పోనీ గొడవెందుకులెమ్మని తను పట్టించుకోనట్టు వూరుకుంటుంటే కాల్చి తినేసేలాచూడ్డం! "గతిలేక మా పంచన చేరావు—గుర్తుంచుకో",

అన్నట్టు చులకన చేసి మాట్లాడ్డం!

సుత్తి దెబ్బలకు వెరచి రోట్లో తల దాచుకున్నట్టుంది తన పరిస్థితి.

ఇందాకటి కిందాక?...ఏమీ అన్లేదు తను—"బుజ్జిగాడు చూడొదినా ఈ పేజీ ఎలా చింపేశాడో?" అని చాలా మామూలుగానే అంది.

అంతే. గయ్ మంటూ చిన్నసైజు రాక్షసిలా విరుచుకుర పడింది.

"పసిపిల్లాడు—వాడికేం తెలుసు? చింపాడంటే తెలిసి చింపాడా? ఇంతమాత్రానికే చాడీలు చెప్పాలా? ఎదురుగా నేనున్నాను కాబట్టి సరిపోయింది. లేకపోతే చావగొట్టిందువేమో ?! అయినా చింపుతాడు. ఇదిగాకపోతే మరో వంద పేజీలు చింపుతాడు. ఇది నా ఇల్లు— వాడు నా కొడుకు. వాడికి సరిగ్గా చింపడం చేతగాకపోతే నేనే నేర్పించి చింపిస్తాను. ఏం—ఏం చేస్తావే?" అంటూ తారాజువ్వలా లేచింది.

"అదికా దొదినా"అంటే—"ఏది కా దొదినా?" అని మొదలెట్టి, మాటల్ని అటుతిప్పి, ఇటు తిప్పి చిన్నసైజు తుఫానులాంటిది సృష్టించి, చివరికి "మొగుడితో తిన్నగా కాపురం చెయ్యడం చేతగాక పుట్టింటికొచ్చిన దానివి, నాకు నీతులు చెప్పొచ్చావా? సాయంత్రం షికారొద్దన్నాడనీ, ఆదివారంనాడు సినిమా వద్దన్నాడనీ—ఇలాంటి చచ్చు కారణాలకోసం మొగుణ్ణొదిలొచ్చిన దానివి నీకు బుర్రా బుద్ధీ ఎలా ఉంటుందిలే! అయినా ఇవన్నీ అనవసరం. ఇది నా ఇల్లు—నా ఇంట్లో నా మాటే చెల్లాలి. అందుకు నీ కిష్టమైతేనే ఉండు. లేకపోతే..." అంటూ ఆపేసింది.

"ఫో" అన్న ఆ ఒక్క ముక్కే అన్లేదు.

అనకపోతేనేం? పొమ్మనలేక పొగ పెడుతున్నట్టు స్పష్టంగా తెలుస్తుంటే...

పోనీ మధ్యలో తల దూర్చినవాడు—వాడు—మాత్రం ఏమన్నాడు?

తప్పంతా తనదే నన్నాడు.

ఛ,ఛ...తన కాపురం మాటెలా ఉన్నా, ఇక్కడికి

రావడం మాత్రం నిస్సందేహంగా తప్పే! తప్పు కాదు—తప్పున్నర!

"మొగుణ్ణి నీకిష్టమైన రీతిలో మార్చుకోవడం చేతగాకపోయాక ఎందుకు నీ ఆడజన్మ?" అంది పదినోసారి.

ఆలోచిస్తూంటే— అదే రైటేమో అని పిస్తూంది. ఇక్కడుండి వీళ్ళతో ఇలా పడరాని మాటలు పడేకంటే—అతని దగ్గరికే వెళ్ళి, అతన్నే మార్చుకోవడం తేలికా, మంచిదీ కూడాను.

తనింతవరకూ ప్రయత్నించలేదు గాని, ప్రయత్నిస్తే అతను మారకపోడు.

అంతవరకూ చిందర వందరగా సాగిన కౌసల్య ఆలోచనలు అక్కడో క్షణ మాగి, నిర్దుష్టమైన ఒక రూపాన్ని సంతరించుకున్నాయ్.

కాస్సేపటికి ఆమె ఒక నిర్ణయాని కొచ్చింది.

* * *

"నేను వెళ్ళిపోవాలనుకుంటున్నాను."

"వెరీగుడ్. సాయంత్రం నాలు గింటికి ట్రైనుంది, తయారవు."

అన్నయ్య కళ్ళలోని మెరుపుని చూసి చివుక్కు మంది కౌసల్య మనసు.

వెళ్తా ననగానే 'ఎక్కడికమ్మా?' అనైనా అడక్కుండానే వెళ్ళి పొమంటున్నాడు. 'నేను వెళ్ళిపోవాలనుకుంటున్నాను' అన్నదేగాని, 'నా భర్త దగ్గరికి' అని చెప్పలేదు తను. అలాంటప్పుడు వాడే గనక ఒక మనసున్న మనిషైతే—న్యాయంగా ఎంత ఆందోళన వ్యక్తం చెయ్యాలి?

ఆ ఆందోళనా లేదు; ఎక్కడికి వెళ్ళాలనుకుంటున్నావ్? ఎప్పుడు వెళదామనుకుంటున్నావ్? అన్న ప్రశ్నలూ లేవు. పైగా ఎంత త్వరగా పోతే అంత మంచి దన్నట్టు సాయంత్రం నాలుగు గంటలకి ట్రైనుందని గుర్తు చేస్తున్నాడు.

ఛ, ఛ! ఏం మనిషి? హృదయం లేని మనిషి.

ఇలాంటి మనిషి దగ్గర జీవితాంతం నీడ దొరుకుతుందని భ్రమసి ఎంత పొరపాటు చేసింది తను!

కళ్ళు వెంబడి గిర్రున నీరు తిరుగుతూంటే ఆ విషయం సత్యసాయి గమనించడం ఇష్టం లేక ముఖం పక్కకి తిప్పేసుకుంటూ అక్కణ్ణించి లేచి వెళ్ళి పోయింది కౌసల్య.

* * *

ఆరు నెల్ల తరవాత ఒకరోజు ...

"వద్దు" అంది కౌసల్య ఆముదం తాగినదానిలా ముఖం పెడుతూ.

"ఏం—ఎందు కొద్దూ?" అడిగా డామె భర్త వెంకటేశ్.

"వాళ్ళు హృదయం లేని మనుషులు."

"అలాగా?" నవ్వీఅన్నాడు వెంకటేశ్: "ఒకప్పుడు నన్నూ ఇలాగే అనే దానివి—హృదయం లేని మనిషి నీ, బండరాయి వనీ, జడ పదార్థాన్ననీ."

"అది వేరు".

"సరే, అది వేరే అనుకుందాం—మరి ఇదేమిటి? చెప్పూ?"

కౌసల్యకి నవ్వు రాలేదు. సీరియస్‌గా అంది: "మీ కేం తెలీదు. ఈ ఆహ్వానం ఏదో ఫార్మాలిటీ కోసం. అంతే తప్ప మన మీద ప్రేమ గారిపోయి కాదు. కడుపులో లేకుండా కావలించుకునే మనుషు లంటే నా కసహ్యం. మనం వెళ్ళద్దు. ఏం?—పండగంటే అక్కడికి వెళితేనే పండగా? మనమూ చేసుకోవచ్చు. ఇక్కడే, ఇంచక్కాను."

"ఇంతకూ నువ్వనేది?. . ."

"తెలుగు లోనే చెప్పాను. వాళ్ళు హృదయం లేని మనుషులు కనక మనం అక్కడికి వెళ్ళబోవడం లేదు—అంతే."


"అంతేనా?"

"ముమ్మాటికీ అంతే".

వెంకటేశ్ పకపకా నవ్వాడు.

"నవ్వడానిక్కూడా కారణ ముండాలి" రుసరుసా చూసింది కౌసల్య.

ఆ రుసరుసకి భయపడో మరేమో, పకపకని చిరునవ్వుగా కన్వర్ట్ చేస్తూ ఆఫీసు రూమ్‌లోకి వెళ్ళి అయిదు నిమిషాల్లో తిరిగొచ్చిన వెంకటేశ్ కౌసల్య చేతిలో ఒక ఉత్తర ముంచాడు.



కన్ను

ఫోటో— బి. ఎ. రెడ్డి

"ఏమిటిది?" అందుకుంటూ అడిగింది.

"చదువు తెలుస్తుంది."

మడతలు విప్పి ఉత్తరంలోకి దృష్టి సారించింది కౌసల్య.

"డియర్ వెంకటేశ్,

ఈ ఉత్తరం కన్నా ముందే కౌసల్య నిన్ను చేరి ఉంటుందనుకుంటాను.

నీపై ఆగ్రహించి పుట్టింటికి వెళ్ళిన మనిషి ఇంతత్వరగా రావడం నిన్నెంతో ఆశ్చర్యపరిచి ఉంటుంది నాకు తెలుసు.

నిజానికి కౌసల్య చాలా మొండిది. చిన్నప్పటినుంచీ ముద్దుగా పెంచబట్టి తన మనసుకు తోచిందే వేదమన్న ధోరణ్ణి అలవర్చుకుంది. నేనూ, మీ చెల్లెలూ పూనుకోక పోయినట్లైతే అది ఇంత త్వరగా మనసు మార్చుకుని నీ దగ్గిరికి వచ్చేది కాదు.

అవును, కౌసల్య ఇక్కడికొచ్చీ రాగానే చెప్పింది—నీతో తెగతెంపులు చేసుకుని వచ్చేసినట్టు. కారణాలడిగితే కున్నలు తిప్పలు చెప్పుకొచ్చింది. అన్నీ సిల్లీ కారణాల్. నవ్వాలో ఏడవాలో అర్థంకాక నేనూ మీ చెల్లెలూ కలిసి ఒక ఉపాయం ఆలోచించాం. కౌసల్య మా దగ్గర ఉన్న నాలుగు రోజుల్లోనే ఈ ఇంట్లో ఉండటం కన్నా నరకంలో ఉండటం మేలనిపించేలా ప్రవర్తించాం. అంతే—వెంటనే నీ వద్దకు తిరుగు ప్రయాణ మైంది.

వెంకటేశ్! కౌసల్య ఇంకా చిన్న పిల్ల. జీవిత మంటే ఏమిటో, అందునా వివాహ బంధ మంటే ఏమిటో, ఎంత పటిష్టమైనదో తన కింకా తెలీదు. కనక తనని మన్నించి ఆదరంగా, ఆప్యాయంగా చూసుకోవలసిందిగా ప్రార్థిస్తున్నాను.

ఏది ఏమైనా. తని కొంచెం అర్థం చేసుకుని ప్రవర్తించడానికి ప్రయత్నించు. అంటే నా ఉద్దేశం అది ఆడమన్నట్టల్లా ఆడమని కాదు. కాని, చిన్న చిన్న విషయాలనుకూడా భూతద్దం లోంచి చూసి కలత చెందే మన్నిత మనస్కురాలు కౌసల్య. అది గమనించి ఆమె కోరే చిన్న చిన్న కోర్కెలకు వి లువ నిస్తూండు. భార్య భర్తల్లో కనీసం ఒక్కరైనా సర్దుకు పోకపోతే, రంగుల హరివిల్లులా ఉండాలిసిన దాంపత్యం పేలవంగా, చేదుగా తయారవుతుంది.

అందుచేత, 'నేను భర్తని. అది నా మాట వినాలి. అంతేకాని నేను తన మాటెందుకు వినాలి?' లవేదో ఉణిలో కాకుండా తద్భిన్నంగా ప్రవర్తించు.

ఇలా రాస్తున్నందుకు అన్యథా భావించవద్దు. తన చెల్లెలి కాపురం సజావుగా సాగాలన్న ఒకఅన్నయ్య ఆరాటంగా ఉత్తరాన్ని గుర్తించు.

ఉంటాను మరి.

నీ బావ,

—సత్యసాయి."

కౌసల్య ముఖంలో మారుతున్న రంగుల్ని గమనిస్తూ నించుండి పోయిన వెంకటేశ్ ఉత్తరం చదవడం ముగించిన తరవాత ఆమె ముఖం మీద పువ్వుల తివాచీలా పరుచుకున్న ఆనందాన్ని చూసి, ఆనందం వల్ల కాబోలు మరింత అందంగా కనిపిస్తున్న ఆమె ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకుంటూ ఏదో చేయబోయిన వాడల్లా, దాన్ని క్షణ కాలం పాటు వాయిదా వేసి, "ఇప్పుడేమంటావ్?" అడిగాడు.

* * *

ఆ మరునాడు...

కౌసల్యా వెంకటేశ్‌లు ప్రయాణ మయ్యారు హృదయమున్న మనుషుల దగ్గిరికి. *